'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ :రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి మండలంలో అర్హులైన రైతులు తమ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి సూచించారు. మండల కేంద్రంలోని రైతు కేంద్ర కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కావాలంటే మండల రైతులు తమ తమ సచివాలయ పరిధిలో గల రైతు సేవ కేంద్రంలో సంబంధిత పత్రాలు, ఆధార్, వన్ బి పట్టా, ఆధార్ లింక్ ఫోన్ నెంబర్, అకౌంట్ జెరాక్స్ తో కూడిన పత్రాలను వ్యవసాయ ఉద్యానవన సహాయకులకు సమర్పించి ఈనెల 19వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని ఆమె చెప్పారు.

మాట్లాడుతున్న నీలవేణి

అల్లూరి త్యాగం చిరస్మరణీయం

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: బ్రిటిష్ వారిని ఎదిరించడంలో అల్లూరి సీతారామరాజు త్యాగం చిరస్మరనీయమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. బుధవారం అల్లూరి వర్ధంతి పురష్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో అల్లూరి విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారనీ, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేదన్నారు. అటువంటి సమయంలో తెల్లదొరల దోపిడీని అల్లూరి సీతారామ రాజు ధైర్యతో ఎదుర్కొన్నారన్నారు. అల్లూరి సీతారామ రాజుకు మన జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. అల్లూరి పేరుతో ఏర్పడిన జిల్లాలో పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ట్రైనీ కలెక్టర్, కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, డి ఆర్ఓ కె.పద్మలత పాల్గొన్నారు.

పాడేరు ఐటిడిఎలో కూడా అల్లూరి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సంయుక్త కలెక్టర్, ఐటిడిఎ ఇంచార్జ్ ప్రాజెక్ట్ అధికారి ఎంజే అభిషేక్ గౌడ ఐటిడిఎలో గల అల్లూరి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఒ హేమలత, ఎపిఒ ఎం. వెంకటేశ్వర రావు, ఐటిడిఎ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో ఫోటో రైటప్ : నివాళులర్పిస్తున్న ఐటిడిఎ పిఒ, సిబ్బంది

రంపచోడవరం : ఐటిడిఎ సమావేశ భవనంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఐటిడిఎ పిఎ కట్టా సింహాచలం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై ఆయన పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ, డిఈ చైతన్య, ఎస్‌టిఒ పాపారావు, సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్లు బి.కిషోర్, రాజారెడ్డి, ఐటిడిఎ మేనేజర్ బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, పి. వెంకటేశ్వరరావు, చక్రధర్, లక్ష్మి, ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, ఎంపిహెచ్ఒ కుసుడు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

-ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. అరుకులోయ మండల కేంద్రంలోని ఓ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అంగన్వాడీలకు కనీస 26వేలు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడిలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కరణ ఖర్చులకు రూ.20వేలు ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలు చేసిన సుదీర్ఘ పోరాటానికి నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ల ధరలు పెరగటంతో అంగన్వాడి కేంద్రాల్లో వంట ఇతర అవసరాలకు అయ్యే ఖర్చు పెరిగిందని చెప్పారు. గతంలో 42 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాత్మకమైన పోరాటం చేపట్టారని, డిమాండ్లను పరిష్కరిస్తామని మినిట్స్ కాపీ ఆధారంగా హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మినిట్స్ కాపీ హామీలు అమలు చేయాలని కోరుతూ అనేక దఫాలుగా మంత్రులను, ముఖ్యమంత్రికి విన్నవించుకున్నామని, నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని మండిపడ్డారు. పెండింగ్లో ఉన్న అంగన్వాడి సెంటర్ బిల్లులు, టిఎ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీ సమస్యలపై చర్చించాలని,అంగన్వాడీల జీతాలు పెంచాలి, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, సంక్షేమ పథకాలు, గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను అంగన్వాడి కార్యకర్తలు ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్, వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షీభారాణి, రాష్ట్ర కార్యదర్శి రేఖ ఎలిజిబెత్, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, అల్లూరి జిల్లా అధ్యక్షులు నాగమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ బి పోతురాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థులు

యుద్ధాన్ని తలపించిన 'మాక్ డ్రిల్'

ప్రజాశక్తి-పాడేరు:ప్రశాంతంగా ఉన్న పాడేరు కేంద్రంలో ఆర్‌టిసి ఆవరణలో బాంబుల పేలుడుతో ప్రయాణికులు, ప్రజలు ఉలిక్కి పడ్డారు. యుద్ధంపై కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఎస్పి అమిత్ బర్ధర్ ముందుగానే జిల్లా ప్రజలను అప్రమత్తం చేసారు. ఆ విధంగా అనుకున్నట్టే బాంబు పడింది. ఆ తాకిడికి కొంతమంది పరుగెత్తి సురక్షిత ప్రాంతాలలో తల దాచుకోగా మరికొంత మంది బాంబు దాడిలో గాయాల పాలయ్యారు. పలు శాఖల రెస్క్యు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం పాకిస్తాన్ తో యుద్ధం వస్తే, చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ లో భాగం. అంతవరకూ ఏమీ తెలియక ఊపిరి బిగబట్టి చూస్తున్న కొంతమంది ప్రజలు మాక్ డ్రిల్ అని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, ఇటీవల పెహల్గాంలో జరిగిన దుశ్శంఘటన నేపథ్యంలో భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం నెలకొనే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ప్రధాని ఆదేశాల మేరకు యుద్ధం సంభవిస్తే ఎదుర్కొనె విధానాలు, చేయాల్సిన, చేయకూడని, విధులు, రక్షణ భాద్యతలపై మాక్ డ్రిల్ నిర్వహించామని వివరించారు. అనధికార, ఫేక్ వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వార్తలు ప్రచారం చేసి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయవద్దని కలెక్టర్ కోరారు. అధికార వార్తలను మాత్రమె నమ్మాలని సూచించారు. సందర్భాన్ని బట్టి విధ్యుత్ ఆఫ్ అండ్ ఆన్ చేసే విధంగా విధ్యుత్ శాఖ సిద్ధం కావాలన్నారు. సురక్షిత ప్రాంతాలను గుర్తించాలని, విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి సిద్ధం కావాలని సూచించారు. సివిల్, యూనిఫాం సేవల మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉంటె ప్రమాద తీవ్రత తగ్గుతుందన్నారు. యుద్ధం వస్తే పక్కా కట్టడాలు, ట్రెంచ్ లు, కొండలు తదితర రక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. రాత్రి సమయంలో తీవ్రవాదులు చొరబడితే ఇళ్ళల్లో లైట్లు ఆఫ్ చేయాలని, ప్రశాంత వాతావరణం ఏర్పడ్డాక లైట్లువెలిగించాలని, తద్వారా శత్రువు ఉనికిని గుర్తించవచ్చని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ మాక్ డ్రిల్ నిర్వహించామన్నారు.

ఎస్పి అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, అంతర్గతంగా, బహిర్గతంగా ఇలాంటి సమస్యలు ఎదురైతే ప్రజల సహనం, సహకారం అవసరమని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ట్రైనీ కలెక్టర్, కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, చింతూరు, చింతపల్లి ఎఎస్పీలు పంకజ్ కుమార్ మీనా, నవజ్యోతి మిశ్ర, సిఐ దీనబంధు, స్పెషల్ బ్రాంచ్ సిఐ అప్పల నాయుడు, ఎఆర్ ఇన్స్పెక్టర్ శేషాద్రి పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-ఎటపాక: విషాపురం పంచాయతీ జగ్గవరంలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని బుధవారం జగ్గారం గ్రామస్తులు చింతూరు ఐటిడిఎకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ మార్చి 29న ఐటిడిఎ పిఒ జగ్గారం గ్రామాన్ని సందర్శించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని సిపిఎం నాయకుల సహకారంతో ఐటిడిఎ గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులను కలసి విన్నవించామని తెలిపారు. పిఒ అందుబాటులో లేకపోవడంతో ఎపిఒకు వినతి అందించామన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి.స్థానిక పార్టీశాఖ కార్యదర్శి రవి, దేవా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-రంపచోడవరం : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, రంపచోడవరం పరిధిలో అడ్డతీగల, రాజవొమ్మంగి, మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 18 మిగుల సీట్ల భర్తీ కోసం గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఈ నెల పదో తేదీ లోపు ఆయా పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని ఇతర వివరాలకు కన్వీనర్ ప్రిన్సిపాల్ ఏకలవ్య పాఠశాల, మారేడుమిల్లి వద్ద సంప్రదించాలన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి ఉమాదేవి

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలం కొండగోకిరి సచివాలయంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ 2025కి సంబంధించి మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ బుధవారం ప్రారంభించారు. పచ్చిరొట్ట విత్తనాలు వాటి లాభాలు గురించి రైతులకు తెలిపారు. దీనివల్ల భూసారం పెంపొందించవచ్చన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను తీసుకోవాలని కోరడం జరిగింది తద్వారా అధిక దిగుబడులు మరియు అధిక లాభాలు పొందగలరన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జనుము, జీలుగ విత్తనాలను అందుబాటులోఉంచామని ఇవి ఒక ఎకరాకు 10కిలోల చొప్పున రైతులు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఈఒ సత్యనారాయణ రైతుసేవ కేంద్ర సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశం రద్దు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఐటిడిఎ పాలకవర్గ సమావేశం ఈనెల 13వ తేదీన నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలవల్ల రద్దు చేశామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనివార్య కారణాల వలన సమావేశం రద్దు చేశామని ఈ విషయాన్ని వివిధ శాఖాధికారులు వివిధ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు గమనించగలరని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

అంగన్‌వాడీ భవనం పూర్తి చేయరూ..!

సిడిపిఒకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అడ్డతీగల: వై.రామవరం మండలం దాలిపాడు పంచాయతీ పరిధి గుమ్మరిపాలెంలో 2016లో అంగన్‌వాడీ భవన నిర్మాణం ప్రారంభించి అసంపూర్తిగా వదిలి వేశారు. ఈ విషయమై గుమ్మరి పాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ద్వారా అడ్డతీగల ఐసిడిఎస్ సిడిపిఒ సుధకు ఈ విషయమై విన్నవించారు. సిడిపిఒ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని పై అధికారులకు తెలియచేసి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. జాతీయమానవహక్కుల సంస్థ రంప చోడవరం నియజకవర్గం ఇన్‌చార్జి రాంప్రసాద్, మహిళా విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీదేవి సూచనల మేర అడ్డతీగల మండల అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు నవాజ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్, ఛైర్మన్

రూ.9.80 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు నిర్మాణం

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-దంబ్రిగుడ: జిల్లాలో రూ.9.80 కోట్ల వ్యయంతో ఐదు ఎకరాల్లో 36 యూనిట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు నిర్మిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని అరకు సంతబయలు వద్ద ఐదు ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఎఫ్ఎస్‌సిలు ఏర్పాటుతో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లో అరకు బ్రాండ్ పేరున కాఫీ, మిరియాలు, పసుపు, చిరుధ్యాన్యాలు, ఇతర గిరిజన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎం ఎస్ ఎం ఇలను ప్రోత్సహిస్తామన్నారు. రూ 500 కోట్లతో పరిశ్రమల పార్కులు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు.

ఆర్టీసి చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో గిరిజన యువతకు ఆర్థిక పురోగతికి దోహద పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజక వర్గంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో అరకు వ్యాలీ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు సర్పంచ్ శారదా సాగర్, స్థానిక నేతలు సుబ్బారావు, ఎంపిడి ఓ ప్రేమసాగర్, ఎపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో స్ప్రేయింగ్ చేయించుకోవాలి

ప్రజాశక్తి -అనంతగిరి:ఏజెన్సీలోని గిరిజనులు ఇంటిలో దోమల మందు పిచికారి చేయించుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ వివి. కుమార్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్ జ్ఞానేశ్వరి. సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న మలేరియా స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని బుధవారం అధికారులు ప్రత్యక్షంగా జరుగుతున్న తీరును పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ దష్టిలో పెట్టుకొని గిరిజన ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించవలసిన అవసరం ఉందని అలాగే మలదిన్ స్ప్రింగ్ ప్రతి ఇంటికి చేయించుకోవాలని సూచించారు మండలంలోని 242 గ్రామాలు గుర్తించమని అందులో 105 గ్రాములు ఇప్పటికే స్ప్రేయింగ్ కార్యక్రమాలు కొనసాగయని మిగితా గ్రామాలు కూడా సహకరించి పూర్తి విజయవంతం నికి తోడ్పడాలని గ్రామ ప్రజలకు వారు కోరారు ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.రామారావు మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ జి. రామసుందర్ పాల్గొన్నారు.



స్ప్రేయింగ్ ను పరిశీలిస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రాలు వెల..వెల..

- ముందుగా అడ్వాన్స్‌లు తీసుకోవడంతో అనివార్యంగా ప్రైవేటుకు విక్రయం
- ప్రభుత్వ నిబంధనలు కూడా అడ్డంకిగా మారిన వైనం

ప్రజాశక్తి- రంపచోడవరం : జీడి మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో రంపచోడవరం ఐటిడిఎ పిఒ వందన వికాస్ కేంద్రాల ద్వారా జీడి మామిడి పిక్కలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రైవేటు కొనుగోలుదారుల కంటే సుమారు ఐదు నుంచి పది రూపాయలు ఎక్కువ ధర ద్వారా కొనుగోలు చేస్తున్న రైతులు మాత్రం దళారులకు అమ్మేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. కొనుగోలు కేంద్రం వద్ద కేజీ జీడి పిక్కకు రూ.136 ధర ఉండగా ప్రైవేటు కొనుగోలు కేంద్రాల వద్ద 130 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. రంపచోడవరం మండలంలో సుమారు 5,758 ఎకరాల జీడి మామిడి సాగులో ఉండగా ఒక్కొక్క ఎకరాకు సుమారుగా 230 నుండి 250 కిలోలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంటే సుమారుగా 14,39,500 కిలోల జీడి మామిడి ఉత్పత్తి అవ్వగా విడివికె ద్వారా 33 వేల కిలోలు మాత్రమే కొనుగోలు చేశారు. మిగతా ఉత్పత్తి అంతా దళారులకే అమ్ముడు పోయాయి.

మా వద్దకు తక్కువగా వస్తున్నారు..

దీనిపై విడివికె ట్రెజరర్ పొడియం తేజేశ్వరి, విడివికె అద్యక్షురాలు సుధారాణిని వివరణ కోరగా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం ద్వారా 33 వేల కిలోలు జీడీ మామిడి కొనుగోలు చేయండం జరిగిందని రైతులు తక్కువగా తీసుకువస్తున్నారన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా నగదు రైతుల ఖాతాలలో నేరుగా జమచేస్తున్నామన్నారు. అయితే సాంకేతిక కారణాల వల్ల నగదు రైతుల ఖాతాల్లోకి 4 రోజులు తర్వాత జమవుతోందని దీంతో ఆసక్తిని కనబరచడం లేదని తెలిపారు. తమ వద్ద 100 కిలోలపైన అమ్మకానికి తీసుకువస్తే తీసుకువచ్చిన వ్యక్తి నుంచి భూమిపట్టా జిరాక్స్ కోరుతున్నామని దీనివల్ల ఎక్కువ కొనుగోలు చేయలేకపోతున్నామన్నారు.

ఐపిడిఎ కొనుగోలు కేంద్రం

ప్రైవేటు వ్యాపారుల వద్ద అడ్వాన్స్ తీసుకున్నందున వారికే విక్రయం

నేను రెండు ఎకరాల్లో జీడిమామిడి సాగు చేశారు. వ్యవసాయ పనుల నిమిత్తం ముందుగా ప్రైవేటు కొనుగోలుదారులు నాకు అడ్వాన్సు ఇచ్చారు. దాంతో కొన్ని పనులు చేసుకున్నాను. దాంతో ముందుగా నగదు తీసుకున్నాను కాబట్టి ప్రైవేట్ వ్యక్తులకే విక్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం కూడా ముందస్తుగా వ్యవసాయ పనులకు నగదు ఇస్తే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే విక్రయిస్తాను. బ్యాంకులో నగదు జమ అవడం కూడా బాగా ఆలస్యం అవుతోంది.

- బోరగ వెంకన్న దొర, జీడిమామిడి రైతు

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

ప్రజాశక్తి-చింతూరు: మండలంలో స్కూల్ శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ డిమాండ్ చేశారు.బుధవారం ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అయినా స్కూల్స్ సానిటేషన్ వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలపై పోరాటం చేయాలన్నారు. పని గంటలు తగ్గించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సమావేశంలో స్కూల్ శానిటేషన్ వర్కర్లు సురేష్. జయలక్ష్మి. కుమారి, విజయ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి-సీలేరు/వై.రామవరం: సీలేరులో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడమే కాక టోల్ ఫ్రీ నంబర్‌ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ బచ్చులూరులో భారీవర్షం కురిసింది. కేశవరావు ఇంటిపక్క కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. దీంతో అక్కడే ఉన్న చిరుగూరి కాసులమ్మ, లండ నుకమని, కాకూరు బాలమ్మ పిడుగుశబ్దానికి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని మంగంపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వారికి ఎటువంటి ప్రాణహాని కలగలేదు. దారకొండ, దుప్పిలివాడ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

సీలేరులో కురుస్తున్న వర్షం

హౌసింగ్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-వై.రామవరం: హౌసింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ బాపన్నదొర అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ హెల్పర్, అసిస్టెంట్ మహిళా పోలీసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న ఐదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులను గుర్తించి ఆరోతరగతిలో ప్రవేశానికి విద్యార్థులకు ప్రత్యేక వాలంటీర్లతో అవగాహన కల్పించాలన్నారు. అన్నిరకాల, జిఎస్‌డబ్ల్యూఎస్ సర్వే వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా వచ్చిన రేషన్ కార్డుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ శ్రమ కార్డులు గురించి, పిఆర్, 1 యాప్ పక్కాగా అందరూ పంచాయతీ కార్యదర్శులు ఇంజనీర్ అసిస్టెంట్ అమలు చేయాలని, ఐవిఆర్ఎస్ కాల్స్ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ కట్టడాలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు ఏఈ, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎపిఎం, ఎపిఒ పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT CUM SC & ST COURT JUDGE AT VIZIANAGARAM
M.O.P.NO.386/2024

Between:
Pangi Subhadramman @ Subhadra ....Petitioner
And:
Killo Ratnakar and others ....Respondents

To
The 1st Respondent:
Killo Ratnakar, S/o Gurumurthy, aged about 19 years, Driver of motor cycle bearing No. AP 40 AD 3511, Residing at Chompi Village, Araku Valley Mandal, Alluri Seetharamraju District.

The 2nd Respondent:
Killo Gurumurthy, S/o Gundu, aged about not known, owner of motor cycle bearing No.AP 40 AD 3511, Residing at Chompi Village. Araku Valley Mandal Alluri Seetharamraju District.

Take notice that the above petition filed by the petitioner under section 166 of M.V.Act for grant of compensation and the said case is stands posted **23-05-2025 at 10:30 AM.** before the above Court for your appearance, failing which the matter will be decide in your absence.

J.Venkata Rao
Advocate for the Petitioner
Visakhapatnam

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో రహదారులు, భవన నిర్మాణాల అభివృద్ధి పనులను జాప్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పి.ఐ.యు, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, రహదారులు భవనాల శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ప్రధాన మంత్రి జన్ మన్, ఆర్టికల్ 275, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పురోగతిలో ఉన్న పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులపై ఇంజనీరింగ్ విభాగాలు నివేదిస్తే ప్రభుత్వంతో మాట్లాడి బిల్లులు చెల్లింపునకు కృషి చేస్తామన్నారు. రహదారులు, భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. పనులు జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెదబయలు మండలం బూసిపుట్టు - పిట్టల బొర్ర, అనంతగిరి మండలం కటికి రోడ్డు పనుల ప్రగతిపై ఆరా తీసారు.

నీతి ఆయోగ్ నిధులతో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల భవన నిర్మాణాలకు 12 పనులు మంజూరు చేయడం జరిగిందని వాటిని త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 56 కిల్లో మీటర్ల బిటి రోడ్లకు సంబంధించి 34 పనులు మంజూరు చేసామన్నారు. జి.కె. వీధి ఆర్ వి నగర్ మధ్య రహదారి పనులపై రహదారులు భవనాల ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. చింతూరు డివిజనల్ 14 పనులకు నాలుగు పనులు పూర్తి చేసారని మిగిలిన పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. పి ఐ యు ఇంజనీరింగ్ విభాగానికి రూ.390 కోట్లతో 146 పనులు మంజూరయ్యాయని టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో పిఐయు ఇఇ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె.వేణు గోపాల్ పంచాయతీ రాజ్ ఇ ఇ కొండయ్య పడాల్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పిడి విద్యాసాగర్, డిఇఇలు, ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్లను సకాలంలో పూర్తి చేయండి

పాడేరు: సెల్ టవర్ల నిర్మాణాలను నిర్దిష్టమైన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్, ఇంజనీరింగ్ అధికారులు, ఫారెస్ట్ అధికారులతో సెల్ టవర్ల నిర్మాణం, రహదారుల నిర్మాణం, అటవీ అనుమతులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సెల్ టవర్ల నిర్మాణ సామాగ్రి తరలించడానికి అనువుగా ఉండేలా అవసరమైన రహదారులు నిర్మిస్తామని చెప్పారు. జియో సంస్థకు 512 టవర్ల పనులు అప్పగించగా 442 పూర్తి చేశారని చెప్పారు. 28 జియో టవర్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ముంచంగిపుట్టు, అనంతగిరి మండలాల్లో సెల్ టవర్లకు "హదారుల నిర్మాణం చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కే. చిరంజీవి నాగ వెంకట సాహిత్, రంపచోడవరం పిఒ కే సింహాచలం, బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్టెల్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ ఎసిబి అధికారి

ప్రజాశక్తి -మధురవాడ: మధురవాడ ప్రాంతంలో రోజుకో రకమైన నేరఘటనలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.తాజాగా ఒక వ్యక్తి ఎసిబి అధికారి అవతారమెత్తి, స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బెదిరించి, డబ్బులు వసూలుకు యత్నించి పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలివి.

సుధాకర్ అనే వ్యక్తి బుధవారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తాను ఎసిబి సిఐనని రిజిస్ట్రార్‌ను పరిచయం చేసుకున్నాడు. రెండు మూడు రోజుల నుంచి గమనిస్తున్నానని,.ఉద్యోగం పేరుతో అవినీతికి పాల్పడుతున్నారంటూ రిజిస్ట్రార్‌ను బెదిరించాడు ఎటువంటి కేసు లేకుండా చేసేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్, ఎసిబి సిఐఅని ఎలా నమ్మాలని ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఎసిబి ఎస్‌పిగా చెప్పుకునే ఒక మహిళతో ఫోనులో మాట్లాడించాడు. ఆ మహిళ సైతం తాను ఎసిబి ఎస్‌పినని బెదిరించడంతో అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ చక్రపాణి పిఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నకిలీ ఎసిబి అధికారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అల్లూరికి ఘన నివాళి

అరకులోయలో నివాళి అర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చింతపల్లిలో నివాళి అర్పిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి- చింతపల్లి: విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో పాత బస్టాండ్ వద్ద అల్లూరి విగ్రహానికి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు. బోనంగి చిన్నయ్య పడాల్ బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఐదవ షెడ్యూల్డ్ భూభాగమంతా ఆదివాసి గిరిజన ప్రాంతమేనని ఎమ్మెల్యేల నుంచి స్థానిక వార్డు సభ్యుల వరకు అందరూ గిరిజన ప్రజాప్రతినిధులేనని, అలాంటప్పుడు ఇక్కడ ఉన్న ఉద్యోగాలు గిరిజలనులకు కాదని గిరిజనేతరులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. 1/70 భూ బదలాయింపు చట్టం ఉల్లంఘన జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు నిమ్మ కి నీరెత్తినట్లు ఉన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, కిల్లో సింహాచలం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకొని చింతపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దురియా పుష్పలత, కార్యదర్శి శ్రీధర్ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేశారు.ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది రామకృష్ణ, ప్రశాంతి, సునీత, మంజుల వాణి, రమణమ్మ, హరి ప్రసాద్, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావులు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని మనమంతా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, జనసేన మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, మండల విస్తరణ అధికారి తారక రామారావు పాల్గొన్నారు.

అరకులోయ: అరకులోయలోని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం క్యాంపు కార్యాలయంలో బుధవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అరకు ఎంపీ గుమ్మ తనుజరాణి అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒకరు అల్లూరి స్ఫూర్తితో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు చెట్టి వినయ్, కమిడి అశోక్, స్వాభి రామ్మూర్తి, పాంగి చిన్నా రావు, ఎల్బి కిరణ్, శెట్టి రామారావు, బాలరాజు, కొర్ర రాధిక, రమేష్, ముఖి సాంబయ్య, మల్లేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో బుధవారం అల్లూరి సీతారామరాజు వర్దంతి నిర్వహించారు. స్థానిక పోస్టాఫీసు వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సర్పంచ్ పాంగి దుర్జో, ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట యోధుడని ప్రశంసించారు. కార్యక్రమంలో వర్తక సంఘ సభ్యులు మల్లికార్జునరావు, బాబురావు, ఎపి జెన్కో ఉద్యోగులు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక రాజేంద్రపాలెం అల్లూరి సీతారామరాజు స్మారక ఉద్యానవనంలో అల్లూరి వర్దంతి నిర్వహించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అల్లూరి విగ్రహానికి అల్లూరి కాల్చి చంపబడిన చింత చెట్టు ప్రాంతంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లూరి స్మారక ప్రదేశాలను సందర్శించి నిర్లక్ష్యానికి గురై ఉన్న ప్రాంతాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు టి.సుబ్బిరామిరెడ్డి, అరకు మాజీ పార్లమెంటు సభ్యురాలు కొత్తపల్లి గీత నిధులనుండి పదేసి లక్షలతో మంప, రాజేంద్రపాలెంలో గ్రామాల్లో గల అల్లూరి స్మారక ప్రదేశాల అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కేంద్ర మంత్రి సురేష్ ప్రభు నిధుల నుండి కోటి రూపాయల నిధుల మంజూరుకు కృషిచేసినట్లు తెలిపారు. రాజేంద్రపాలెంలో రూ. 50 లక్షల పార్కు, చెరువుల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు శివకుమార్ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణారావు జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

మినీ రైల్వే స్టేషన్ మంజూరుపై హర్షం

మాట్లాడుతున్న ఎంపీ తనుజారాణి, ఎమ్మెల్యే మత్స్య లింగం

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకు లోయలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మినీ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ప్రకటించడంపై అరకు ఎంపీ గుమ్మ తనుజరాణి హర్షం చేశారు. బుధవారం అరకులోయ విచ్చేసిన ఆమె తమ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది జనవరి 1 నుంచి అరకు రైల్వే రిక్వెస్ట్ స్టాపు లో విశాఖ - కిరెండోలు పాసింజర్ రైలు ఆపకపోవడంతో ఈ రిక్వెస్ట్ స్టాప్‌ను నమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్న ఆటో మోటారు యూనియన్ కుటుంబాలు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారని ఆమె అన్నారు. ఈ సమస్యను విశాఖ రైల్వే డిఆర్ఎం, జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే రిక్వెస్ట్ స్టాపు పునరుద్ధరించాలని విన్నవించడం జరిగిందన్నారు. దీంతో రెండు రోజుల క్రితం కేంద్ర రైల్వే మంత్రి మంత్రి అశ్విని వైష్ణవ్ తనకు స్వయంగా ఫోన్ చేసి, రిక్వెస్ట్ స్టాప్ కాకుండా మినీ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు తీసుకుంటున్నట్లు చెప్పారని ఆమె అన్నారు. ఇందుకుగాను రూ. 2.5 కోట్ల రూపాయలు వెచ్చించి మినీ రైల్వే స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారని ఆమె అన్నారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, ఈ రిక్వెస్ట్ స్టాపు ఎత్తివేయడంతో అనేక మంది ఉపాధి కోల్పోయారన్నారు. పేరుకే అరకు రైల్వే స్టేషన్ అని స్టేషన్ ఉన్నది అరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎండపల్లి వలసలో రైల్వే స్టేషన్ ఉందని దీంతో దీంతో అక్కడ రైలు దిగి అరకువేలికి రావడానికి 50 నుంచి వంద రూపాయలు ఖర్చు అవుతుందని ఆయన అన్నారు. ఈ విషయాన్ని రైల్వే డి. ఆర్.ఎం, ఎంపీ దష్టికి తీసుకెళ్లడం జరిగింది అన్నారు. అనతి కాలంలోనే మినీ రైల్వే స్టేషన్ మంజూరు కావడం ఆనందదాయకమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

మొక్క నాటుతున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ జోనల్ చైర్మన్

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలను ఈనెల 8, 9, 10 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఉత్సవ పోస్టర్లను వెంకటేశ్వర స్వామి కమిటీ చైర్మన్, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, ఉత్సవ్ కమిటీ చైర్మన్ సివేరి బాలకృష్ణల ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, అరకు ఎమ్మెల్యే రేగం మత్సలింగం చేతుల మీదుగా ఆవిష్కరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అరకు ఎమ్మెల్యే, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ లు సూచించారు.వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. స్టేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ చైర్మన్లు దాసు బాబు, బాలకృష్ణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కాపుగంటి కృష్ణారావు, అప్పలరామ్, రంగా, చందు కామేష్, గడ్డం నర్సింగరావు, సత్యనారాయణ, వైఎస్ఆర్సిపి నాయకుడు అశోక్, పద్మావతి ఉద్యానవన కేంద్రం హెచ్ఓ లకే బొంజు బాబు, టిడిపి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు ఎంపిటిసి భీమరాజు పాల్గొన్నారు.

జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి ఘన నివాళి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : తెలంగాణ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తూ ఈనెల 4న అనారోగ్యంతో మృతి చెందిన జస్టిస్ ఎం.గిరిజ ప్రియదర్శినికి బుధవారం విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాపసభలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్ మాట్లాడుతూ జస్టిస్ గిరిజాప్రియదర్శిని విశాఖపట్నం సీనియర్ న్యాయవాది ఎన్వి బద్రీనాథ్ వద్ద ఆఫీస్ జూనియర్‌గా జాయిన్నై, ఇక్కడే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ జిల్లా జడ్జిగా ఎంపికయ్యారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరీంనగర్, ప్రకాశం విజయనగరం తదితర జిల్లాల్లో ప్రధాన న్యాయమూర్తిగా తన సేవలందిస్తూ ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు జడ్జిగా ఉద్యోగోన్నతి పొందారన్నారు. విశాఖపట్నం న్యాయవాదుల సంఘానికే గర్వకారణమైన జస్టిస్ ఎం.గిరిజ ప్రియదర్శిని అకాల మరణంఉమ్మడి రాష్ట్రానికే కాక ముఖ్యంగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘానికి తీరని లోటన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు రామ జోగేశ్వరరావు, బైపా అరుణ్‌కమార్, సీనియర్ న్యాయవాదులు బివి రామాంజనేయరావు (ఐలు), మహమ్మద్ అభయ్యుల్లా, పప్పు అనూరాధ, విజయలక్ష్మి, తదితరులు ఆమె సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నమ్మ శెట్టి రాజు ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు.

అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి పోరాటం చేయాలి

సమావేశమైన అఖిలపక్షనాయకులు

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పాలగడ్డ వరకూ అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణ పనులు చేపట్టే విధంగా పోరాటం చేయాలని అఖిలపక్షాలు పిలుపు నిచ్చాయి. సీలేరు రైతుభరోసా కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సీలేరు దుప్పిలివాడ దారకొండ గుమ్మిరేవులు గాలికొండ తదితర పంచాయితీ ప్రజాప్రతినిధులు అన్ని పార్టీల నాయకులు కలిసికట్టుగా పోరాటంలో పాల్గొనడానికి కార్యాచరణ రూపొందించారు. రహదారి నిర్మాణంపై ప్రభుత్వం, అధికారులపై ఏ విధంగా ఒత్తిడి తేవాలో వారివారి అభిప్రాయాలను తెలిపారు. టెండర్లు పూర్తయి11 నెలలు కావస్తున్నా రహదారి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం ఏజెన్సీ ప్రజల పాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది భారీ వర్షాలకు లంకపాకల నుంచి సీలేరు వరకు రహదారి పూర్తిస్థాయిలో కొట్టుకుపోయి తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై అఖిలపక్ష నాయకులు ఉద్యమాన్ని చేపట్టి రహదారి నిర్మాణం చేసే విధంగా ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. ఆయా పంచాయతీ సర్పంచులు ఎంపీటీసీలకు రాజకీయ నాయకులకు సమాచారం ఇచ్చి ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాంగి దుర్జో, ఉప సర్పంచ్ వల్లిప్రసాద్, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి అల్లూరి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్, కూటమి నాయకులు గోవిందు సదరము, మారిబాబు, అప్పలరాజు గిరిజన సంఘ నాయకులు మనోజ్‌కుమార్ తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణలో రూ.కోట్లలో స్కాం


మాట్లాడుతున్న గంగరాజు

ప్రజాశక్తి-మారేడుమిల్లి: కోట్లలో కుట్టుమిషన్ శిక్షణ స్కాం జరిగిందని మారేడుమిల్లి వైసిపి బిసి నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం రూ.167 కోట్లు స్కాం చేసిందని రంపచోడవరం నియోజకవర్గ బిసి అధ్యక్షులు బొడ్డేటి గంగరాజు బుధవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. మారేడుమిల్లి వైసిపి మండల అధ్యక్షుడు సత్తి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కుట్టుమిషన్ల శిక్షణలో భారీ అవినీతి జరిగిందని దీనిని బిసి మహిళలు గుర్తించాలన్నారు. మారేడుమిల్లి మండల బిసి నాయకులు కాసగాన సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అరకు లోయలో భారీ వర్షం

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల వర్షంతో పాటు, పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడ్డాయి. టౌన్షిప్‌లోని ఓ ఇంటి సమీపంలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల పిల్లల వారు ప్రాణభీతితో పరుగులు తీశారు.

ముంపు బాధితులందరికీ న్యాయం

ప్రజాశక్తి- చింతూరు: చింతూరు మండల కేంద్రంలో 30వ (ఆఖరి) ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభను ఐటిడిఎ పిఒ బుధవారం నిర్వహించారు. గ్రామసభలో మొదట అర్హుల అనర్హుల జాబితాను చదివి వినిపించారు. చింతూరు గ్రామంలో మొత్తం 1808 పిడిఎఫ్‌లు గాను 1641 మందిని అర్హులు, 167 మందిని అనర్హులుగా గుర్తించారు. రెండు జాబితాలో పేర్లు లేని వాళ్ళ నుండి ప్రాజెక్ట్ అధికారి అపూర్వభరత్ దరఖాస్తులు తీసుకున్నారు. గ్రామసభతో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురవుతున్న ఫేజ్ 1బి లో ఉన్న 32 గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహించారు. మొత్తం ఈ 32 గ్రామాలకు సంబంధించి మొత్తం 13807 పిడిఎఫ్‌లు గాను 12468 మందిని అర్హులు, 1339 మందిని అనర్హులుగా గుర్తించామన్నారు. తదుపరి గ్రామసభలో తీసుకున్న అభ్యంతరాలను మరో పది రోజులలో పరిష్కరిస్తామన్నారు. ఇరిగేషన్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతో టీంలను ఏర్పాటు చేసుకొని భూమి క్వాలిటీ చెక్ చేస్తామన్నారు. 41.15 కాంటూరులో చేర్చని గ్రామాలను కూడా ఇరిగేషన్ టెక్నికల్ టీంతో సర్వే చేయించి వాటిని కూడా 41.15 కాంటూరులో చేర్చి వారికి కూడా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫేజ్ 1ఎ లో ఉన్న గ్రామాల కాలనీల మౌలిక సదుపాయాల పనులు కూడా త్వరలో ప్రారంభించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. చింతూరు సర్పంచ్ కారం కన్నరావు, స్పెషల్ డిప్యుటి కలెక్టర్లు బాలకృష్ణరెడ్డి, నజరయ్య, ఆంజనేయులు, తహశీల్దార్లు చిరంజీవి, శ్రీనివాస్, చింతూరు ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఒ

నగరంలో సివిల్ మాక్‌డ్రిల్

విశాఖ వాసులకు సరికొత్త ఆకర్షణ

మాట్లాడుతున్న రాజారెడ్డి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖవాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే మరొక ప్రత్యేక ఆకర్షణ సిద్ధమైంది. బీచ్‌రోడ్‌లో పోలీస్‌మెస్ వెనుక భాగంలో సువిశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్‌పోలో నయాగరా జలపాతం నమూనా ప్రజలను అలరించడానికి సిద్ధమైంది. బుధవారం దీనిని నిర్వాహకులు ప్రారంభించారు. 30 అడుగుల ఎత్తు, 181 అడుగుల వెడల్పు కడిగిన నయాగరా జలపా తం నమూనాను ఎగ్జిబిషన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పైనుంచి వేగంగా పడుతున్న నేటి ప్రవాహం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఎంతగానో ఆకర్షిస్తోంది. వేసవి నేపథ్యంలో విశాఖ వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను, ముఖ్యంగా చిన్నారులను మరింత అలరించే విధంగా దీనిని ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు రాజారెడ్డి తెలిపారు. ఇప్పటికే జలకన్యలతో విశాఖలో చిన్నారులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ వైజాగ్ ఎక్స్‌పోలో వేసవి దష్ట్యా సరికొత్త ఆకర్షణలతో నగరవాసులకు ఆహ్వానం పలుకుతోంది. టికెట్ రుసుము రూ.150 నుంచి కేవలం రూ.100కే పరిమితం చేసినట్లు తెలిపారు. వైజాగ్ ఎక్స్‌పో ప్రవేశ రుసుము, జలకన్యలు, కాశ్మీర్ సిటీ, నయాగరా జలపాతం అన్ని వీక్షించడానికి కేవలం రూ.100 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. చిన్నారులను ఎంతగానో ఆకట్టుకునే విభిన్న రైడ్లు, మహిళలకు సైతం ఆకర్షించే వస్త్ర ఆభరణాల స్టాల్స్ కుటుంబ సమేతంగా సంతోషాన్ని పంచుకునే వేదికగా రుచికరమైన వంటకాలతో విశాఖ ఎక్స్ పో నగరవాసులను సాదరంగా ఆహ్వానం పలుకుతోంది.

కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: కోటక్ మహీంద్రా ఆధ్వర్యంలో కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని, దీంతో పాటు వన్ కెఈఎఫ్ యాప్ ఆవిష్కరించారని కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సిఈఓ డాక్టర్ గణేష్‌రాజా తెలిపారు. స్థానిక హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఇది కోటక్ మహీంద్రా గ్రూప్‌నకు చెందిన సిఎస్ఆర్ అమలు సంస్థ అన్నారు. కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ టీచర్ సామర్థ్యవద్ధి కార్యక్రమమైన 'క్షమత'. ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుల కోసం, వన్ కెఈఎఫ్ యాప్‌ను అండ్రాయిడ్ ఫోన్ల కోసం విడుదల చేసిందని,ఇది డిజిటల్ విద్యను అందరికి చేరువ చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు అన్నారు. క్షమత ఎపిలో 186 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలు,108 మహాత్మా జ్యోతిబాపులే ఆంధ్రప్రదేశ్ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలల్లో అమలులోకి వస్తోందన్నారు.

13న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈ నెల 13వ తేదీన జెడ్‌పిస్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని విసి హాలులో, జెడ్‌పి సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీసంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4 స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1,6,7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, సంబంధిత ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

మధ్యతరగతి కోసం బడ్జెట్ అపార్ట్‌మెంట్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖనగర పరిసర ప్రాంత మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు నగర పరిధిలో బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్లను నిర్మించ తలపెట్టామని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవగోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ బుధవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించి వినియోగదారుల ఆసక్తి, అవసరాలను తెలుసుకునేందుకు సమగ్ర సర్వేను నిర్వహించదలిచామని పేర్కొన్నారు. ఈ విధంగా సేకరించిన సూచనలు, సలహాలను సమగ్రంగా పరిశీలించి వాటికి అనుగుణంగా అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. దీనికోసం ఒక నియమిత క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రకటన బోర్డులను నగరంలో జనరద్దీ గల ప్రాంతాల్లో ప్రదర్శిస్తామన్నారు. దీన్ని స్కాన్ చేస్తే వారికి ఒక సర్వే అప్లికేషన్ వస్తుందని, దాన్ని వారు తమ అభిప్రాయాల మేరకు నింపి అప్‌లోడ్ చెయ్యాలని కోరారు.